సాక్షి రంగారెడ్డి

గురువారం । 29 । జూన్ । 2023



చిన్నమ్మను చూడడానికి..

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నమ్మను చూడడానికి బైక్‌పై వెళ్తున్న విద్యార్థి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. 8లో▸



ప్రభుత్వం అండ

ప్రమాదాలకు గురయ్యే కల్లుగీత కార్మికులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. 8లో▸



శరవేగంగా ఆదిబట్ల అభివృద్ధి

పరిశ్రమలు రాకతో ఆదిబట్ల శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

గురుకులాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ఇబ్రహీంపట్నం రూరల్: గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఉపాధ్యాయ, అధ్యాపకులుగా 2023–24 విద్యా సంవత్సరానికి తాత్కాలిక పద్ధతిలో పని చేయయడానికి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు టీటీడబ్ల్యూ ఆర్‌ఈ రీజినల్ కో ఆర్డినేట్ పీఎస్ కల్యాణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కందుకూరు, హయత్‌నగర్ పాఠశాలల్లో పని చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. జూలై 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, 7న ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. రాజేంద్రనగర్‌లోని కార్యాలయానికి ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంప్రదించాలని కోరారు. బాలికల విద్యాలయాల్లో మహిళా అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉంటుందని, మరిన్ని వివరాలకు 83339 25367 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

30న అధ్యాపక పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ

మొయినాబాద్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ నెల 30న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు రంగారెడ్డి, హైదరాబాద్ ప్రాంతీయ సమన్వయాధికారి శారద బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. షేక్‌పేట్ గురుకులంలో ఇంగ్లిష్–2 పోస్టులు, ఫిజిక్స్–1, సోషల్–1, నార్సింగి గురుకులంలో ఫిజికల్ సైన్స్–1, గొలిదొడ్డి గురుకులంలో ఫిజికల్ సైన్స్–1, చేవెళ్ల గురుకులంలో గణితం–1, లైబ్రేరియన్– 1, శంకర్‌పల్లి గురుకులంలో పీఎస్‌ఎస్‌టీ–1, హిందీ–1, ఇంగ్లిష్–1, సోషల్–1 పోస్టులకు ఈ నెల 30న నార్సింగి గురుకులంలో ఉదయం 10 గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పోస్టుగాడ్యూయేషన్‌తోపాటు బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆమె సూచించారు.

ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: జాతీయ ఉపాధ్యాయ అవార్డు -2023 ఎంపికకు సంబంధిత ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చేనెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన ప్రింట్ కాపీ, అనుబంధ సంబంధిత పత్రాలను జత చేసి మూడు సెట్లను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

‘వర్గీకరణ’లో ప్రభుత్వాలు విఫలం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ

శంకర్‌పల్లి: ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శించారు. మున్సిపల్ పరిధిలోని సింగాపురం మణి గార్డెన్‌లో బుధవారం ఎమ్మార్పీఎస్ చేవెళ్ల నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాక ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి, దళితులను మోసం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఎస్సీ వర్గీకరణ చేయకపోతే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. జూలైలో జరిగే ‘చలో హైదరాబాద్’ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి కన్వీనర్ కాడిగళ్ల ప్రవీణ్, మాజీ అధ్యక్షుడు నర్సింలు, ప్రధాన కార్యదర్శి శివశంకర్ మాదిగ, చేవెళ్ల నియోజకవర్గం నాయకుడు ప్రవీణ్ మాదిగ, జిల్లా కన్వీనర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయాలను తనిఖీ చేయాలి: మేయర్

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల ప్రారంభించిన వార్డు కార్యాలయాలను రెగ్యులర్‌గా తనిఖీలు చేయాలని మేయర్ విజయలక్ష్మి జోనల్ కమిషనర్లకు సూచించారు. మంత్రి కేటీఆర్ ఆలోచనలకనుగుణంగా ఏర్పాటైన వార్డు కార్యాలయాల ద్వారా ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ యంత్రాంగం వెళ్లాలనేది లక్ష్యమన్నారు. ప్రజలు ఏ వేదిక ద్వారా ఫిర్యాదు చేసినా సమస్యలు పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కారమయ్యాక సైతం ర్యాండమ్‌గా ఫోన్లు చేసి పరిష్కారమైనదీ, లేనిదీ కూడా తెలుసుకోవాలని సూచించారు.

మరో కొత్త మండలం

జిల్లాలో 28వ మండలముగా ‘ఇర్విన్’

- తొమ్మిది రెవెన్యూ గ్రామాలతో ఏర్పాటు
- ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన రెవెన్యూ యంత్రాంగం
- మళ్లీ తెరపైకి గట్టు ఇప్పలపల్లి.. ఆందోళన బాటపట్టిన ప్రజలు



ఇర్విన్ పంచాయతీ కార్యాలయం

సాక్షి, రంగారెడ్డిజిల్లా/ఆమనగల్లు: జిల్లాలో మరో కొత్త మండలం పురుడుపోసుకుంది. దీంతో మండలాల సంఖ్య 28కి చేరింది. పాలనా సౌలభ్యం కోసం మాడ్గుల మండలాన్ని రెండుగా విభజించి, ఇర్విన్ కేంద్రంగా కొత్త మండలాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు బుధవారం ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. తొమ్మిది రెవెన్యూ గ్రామాలను దీని పరిధిలోకి తెచ్చింది. ప్రభుత్వ కార్యాలయాల్లో సత్వర సేవలతో పాటు ప్రజలకు మరిన్ని మౌలిక సదుపాయాలు సమకూరనున్నాయి. అంతే కాదు ఇర్విన్ కేంద్రంగా భూముల ధరలు పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వ నిర్ణయంపై ఆ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల ఒత్తిడికి తలొగ్గి..

నాగర్‌కర్నూల్, నల్లగొండ జిల్లాల సరిహద్దు ప్రాంతంగా ఉన్న మాడ్గుల మండలం కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలో ఉంది. ఇక్కడ మొత్తం 32 పంచాయతీలు ఉండగా, వీటిలో 48,936 జనాభా ఉంది. ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్‌కు ఈ గ్రామాలు 45–50 దూరంలో విస్తరించి ఉండగా, అదే మాడ్గుల మండలానికి 20 నుంచి 25 కిలోమీటర్ల దూరంలో విస్తరించి ఉన్నాయి. తహసీల్దార్, ఎండీఓ కార్యాలయాలకు చేరుకునేందుకు ఆయా గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. సిబ్బంది కొరతతో పనుల్లో నూ తీవ్ర జాప్యం కొనసాగుతోంది. దీంతో మాడ్గులను రెండుగా విభజించాలని కోరుతూ ప్రజల నుంచి వస్తున్న డిమాండ్‌కు ప్రభుత్వం తలొగ్గింది. ఇర్విన్, రాందుగ్యాల, బ్రాహ్మణపల్లి, కొత్తబ్రాహ్మణపల్లి, కాశీగూడెం, ఆర్కపల్లి, జర్పులతండా, పల్లెతండా, పల్గుతండా, అందుగుల, కూబ్యతాండా, అంతంపేట, అన్నెబోయినపల్లి, సుద్దపల్లి, గిరికొత్తపల్లి, నర్సంపల్లి, కలకొండ, చంద్రాయణపల్లి, సంద్రలగడ్డతండా (తొమ్మిది రెవెన్యూ గ్రామాల)తో ఇర్విన్ మండలాన్ని ఏర్పాటు చేసింది. మాడ్గుల మండలంలోని 14 ఎంపీటీసీలకు గాను 7 ఎంపీటీసీలను ఇర్విన్ మండల పరిధిలోకి తెచ్చింది. ప్రస్తుతం ఇర్విన్‌లో మండల కేంద్రానికి కావాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామీణ వికాస్ బ్యాంక్, విద్యుత్ ఉపకేంద్రం, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ఆయుర్వేద ఆస్పత్రి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల వంటి మౌలిక సదుపాయాలు ఉన్నాయి. మండల కేంద్రం ప్రకటనతో మరిన్ని సమకూరనున్నాయి.

గట్టు ఇప్పలపల్లిలో ఆందోళనబాట

ఇర్విన్ మండల కేంద్రం ఏర్పాటు చేయబోతున్న విషయం తెలిసి గట్టు ఇప్పలపల్లి గ్రామస్తులు ఐదు రోజులుగా ఆందోళన బాటపట్టారు. కందుకూరు రెవెన్యూ డివిజన్, తలకొండపల్లి మండలం పరిధిలో 32 పంచాయతీలు ఉండగా, ఇర్విన్ తరహాలో సగం గ్రామాలతో మేజర్ పంచాయతీ అయిన గట్టు ఇప్పలపల్లి కేంద్రంగా కొత్త మండలాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం గతంలో రాష్ట్ర వ్యాప్తంగా కొత్త మండలాలు ఏర్పాటు చేసిన క్రమంలో నెల రోజుల పాటు ఆందోళన చేపట్టిన గ్రామస్తులు.. తాజాగా ఇర్విన్ మండల ప్రకటనతో ఆందోళన మళ్లీ ఉధృతం చేశారు.

ఆమనగల్లు కేంద్రంగా రెవెన్యూ డివిజన్..?

ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే కల్వకుర్తి నియోజకవర్గం పరిస్థితి భిన్నంగా ఉంది. రెండు జిల్లాల్లో ఏడు మండలాలతో విస్తరించి ఉంది. ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల్, తలకొండపల్లి రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉండగా, వెల్దండ, చారకొండ (మూడు గ్రామాలు), కల్వకుర్తి మండలాలు నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉన్నాయి. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాలు కందుకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో.. మాడ్గుల మండలం ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్‌లో కొనసాగుతున్నాయి. ఏసీపీ కార్యాలయం, ఆర్టీఓ కార్యాలయాలు షాద్‌నగర్‌లో ఉండగా, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మహేశ్వరంలో ఉంది. రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో మాడ్గుల కొనసాగుతుండగా, సైబర్‌బాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి కొనసాగుతున్నాయి. ఇక్కడి ప్రజలు చిన్నచిన్న పనులకు ఇతర నియోజకవర్గాల్లోని ప్రభుత్వ కార్యాలయాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఆమనగల్లు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తే కష్టాలన్నీ తీరుతాయని భావిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సైతం ఇదే అంశాన్ని పలు వేదికలపై ప్రస్తావించారు. ప్రజల విజ్ఞప్తికి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం.

పకడ్బందీగా గ్రూప్–4

- జూలై 1న రెండు విడతల్లో పరీక్షలు
- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు
- మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు
- నిర్దేశిత సమయానికి 15 నిమిషాల ముందే గేటు క్లోజ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గ్రూప్–4 పరీక్షల నిర్వహణ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హరీశ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జూలై 1న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పేపర్–2 పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం అదనపు కలెక్టర్ తిరుపతిరావుతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సూపరింటెండెంట్లు, లైజినింగ్ అధికారులు, రూట్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో 98,988 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని, మొత్తం 282 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. దివ్యాంగులకు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే పరీక్ష రాసేందుకు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరుకునేలా ఆయా రూట్లలో తగినన్ని బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారికి సూచించారు. పరీక్ష నిర్దేశిత సమయానికి 15 నిమిషాల ముందే గేట్ మూసి వేయాలని, ఉదయం జరిగే పరీక్షకు 8 నుంచి 9.45 గంటల వరకు, మధ్యాహ్నం జరిగే పరీక్షకు ఒంటిగంట నుంచి 2.15 గంటల వరకు అభ్యర్థులను పరీక్ష కేంద్రాలకు అనుమతించడం జరుగుతుందని, పరీక్షా కేంద్రం గేటు మూసిన తర్వాత ఎవరినీ లోనికి అనుమతించరని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాలను పోలీసుల ఆధ్వర్యంలో స్ట్రాంగ్ ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక లైజనింగ్ ఆఫీసర్ ఉంటారని, ఆకస్మిక తనిఖీల కోసం ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమిస్తున్నట్లు చెప్పారు.

ఆ కేసుల్లో సత్వర న్యాయం జరగాలి

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ హరీశ్ పోలీసు అధికారులకు సూచించారు. కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి నిర్ణీత గడువులోపు చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో బుధవారం కలెక్టర్ హరీశ్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అట్రాసిటీ కేసులు నమోదైన వెంటనే ఎఫ్‌ఐఆర్ తోపాటు బాధితుల ఆధార్ కార్డు, బ్యాంక్ వివరాలను కలెక్టరేట్‌కు సమర్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ట్రయల్ కేసుల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. సామాజిక బహిష్కరణలు విధిస్తూ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. అట్రాసిటీ కేసుల్లో నిందితులు తప్పించుకోకుండా వారికి తగిన శిక్షపడేలా పూర్తి ఆధారాలు సేకరించి న్యాయస్థానంలో సమర్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి రామారావు, గిరిజన సంక్షేమశాఖ అధికారి రామేశ్వరిదేవి, ఆర్డీఓ సూరజ్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లా గణాంక దర్శిణి ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లా గణాంక దర్శిణి (డిస్ట్రిక్ట్ హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్) బుధవారం కలెక్టర్ హరీశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ప్రచురణలో జనాభా, వాతావరణం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, విద్య, రవాణా, కమ్యూనికేషన్, బ్యాంకింగ్, పబ్లిక్ ఫైనాన్స్ ఎకానమీ సోషల్ సెక్యూరిటీకి సబంధించిన అంశాలు వివరంగా ఉన్నాయని తెలిపారు. పబ్లికేషన్ తయారు చేయడంలో ముఖ్య ప్రణాళికాధికారి సౌమ్య, సిబ్బంది చేసిన కృషిని అభినందించారు.

4న నగరానికి రాష్ట్రపతి

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వచ్చే నెల 4న హైదరాబాద్‌కు రానున్నారు. నగరంలోని గచ్చిబౌలి స్టేడియం వేదికగా నిర్వహించే అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ఉత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ హరీష్ సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను సమీక్షించారు. రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లకు సంబంధించి వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. రాష్ట్రపతి పర్యటన జరిగే మార్గాల్లో రోడ్ల మరమ్మతులు, బారికేడింగ్ చేపట్టాలని సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య బృందాలను నియమించడం, తగు పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. రాష్ట్రపతి పర్యటనలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా, లోపాలు లేకుండా చూడాలని, ప్రొటోకాల్‌ను అనుసరించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయాలన్నారు.సమావేశంలో ఆర్డీఓ చంద్రకళ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వర్ రావు, రోడ్లు భవనాల శాఖ అధికారి శ్రవణ్ ప్రకాష్, క్షత్రియ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, మెంబర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమ్మిళిత వృద్ధిపై దృష్టి సారిస్తాం

మంత్రి జగదీశ్‌రెడ్డి

మాదాపూర్: తెలంగాణ ప్రభుత్వం 90 ఏళ్ల అభివృద్ధిని తొమ్మిదేళ్లలో చేసి చూపించిందని మంత్రి జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఇండస్ట్రీయల్ ఇన్నోవేషన్ టెక్నాలజీ ఎక్స్‌పోను ఆయన ప్రారంభించారు. దేశంలోనే ఏ రాష్ట్రం సాధించలేని విజయాలు తెలంగాణ సాధిస్తోందన్నారు. ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిళిత వృద్ధిపై రాష్ట్రం దృష్టి సారిస్తోందన్నారు. అన్ని రంగాల్లోనూ ఆవిష్కరణలు అవసరమన్నారు. వినూత్న ఆలోచనలు పెంపొందించాలని సూచించారు. ఎక్స్‌పోలో దాదాపు 150కిపైగా స్టాల్స్ అందుబాటులో ఉన్నాయి. ఉదయం 11 నుంచి రాత్రి 7 గంటల అందుబాటులో ఉంటుంది. ప్రవేశం ఉచితం. కార్యక్రమంలో ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ స్పెషల్ సెక్రటరీ, విష్ణువర్ధన్‌రెడ్డి, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ సి.తారా సత్యవతి, ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య, టీహబ్ సీఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆ కేసులు ఎత్తివేయండి

- డీజీపీకి సీపీఐ నేతల విజ్ఞప్తి



డీజీపీ అంజనీకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు అండగా నిలిచిన నేతలపై పోలీసులు నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని సీపీఐ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం ఆ పార్టీ నేతలు డీజీపీ అంజనీకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కుంట్లూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 215 నుంచి 224 వరకు సుమారు 100 ఎకరాల భూదాన్ భూమిలో 10 వేల మంది నిరుపేద కుటుంబాల ప్రజలు గుడిసెలు వేసుకున్నారు. వాటిని తొలిగించేందుకు స్థానిక రెవెన్యూ అధికారులు యత్నించగా, వారిని బాధితులతో కలిసి పార్టీ నేతలు అడ్డుకున్నారు. గుడిసెవాసులకు అండగా నిలిచిన సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు సహా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యదిరెడ్డి, పానుగంటి పర్వతాలు, జిల్లా కార్యవర్గ సభ్యులు పామిడి శేఖర్ రెడ్డి, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, మాజీ కౌన్సెలర్ హరి సింగ్ నాయక్‌లతో పాటు మొత్తం 21 మందిపై హయత్ నగర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ పోలీసులు నమోదు చేసిన ఈ అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, ఈ.టి.నరసింహ, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, పానుగంటి పర్వతాలు తదితరులు డిమాండ్ చేశారు. ఆచార్య వినోబాభవే భూదాన భూములను పేదలకు పంపిణీ చేయడానికి సేకరించాడని, ఆ భూములు పేదలకే చెందుతాయి కాబట్టి ఆరునెలల క్రితం కొన్ని వేల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ప్రజలు అక్కడ గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని, ప్రైవేట్ భూములు అసలే కావని, కొంతమంది భూబకాసురుల నకిలీ భూమి పత్రాలను సృష్టించి, రెవిన్యూ మరియు పోలీసుల అండతో గుడిసెలను తొలిగించే ప్రయత్నం చేస్తున్నారని, పోలీసులు భూకబ్జాదారులపై కేసులు పెట్టకుండా గుడిసెల కూల్చివేతలను అడ్డుకొని పేదల పక్షాన నిలిచిన సీపీఐ నేతలపై పోలీసులు అక్రమ కేసులు బనాయించారని డీజీపీకి వారు వివరించారు. భూదాన భూమిపై పూర్వాపరాలు పరిశీలించి ప్రస్తుతం నివాసముంటున్న 10 వేల కుటుంబాల ప్రజల గుడిసెలు తొలగించకుండా, అక్రమ కేసులు బనాయించకుండా ఆదేశించి, పేదలకు న్యాయం చేయాలని వారు కోరారు. అనంతరం చాడ వెంకట్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ పేదల కోసం ఉద్దే శించిన భూదాన భూముల్లో పేదలు గుడిసెలు వేసుకుంటే తప్పేమిటని ప్రశ్నించారు. భూదాన్ భూమిలో గుడిసెలు వేసుకున్న ప్రజలకు వెంటనే పట్టాలిచ్చి, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను డిమాండ్ చేశారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి



గ్రామంలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

కేశంపేట: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ సూచించారు. కేశంపేట మండల కేంద్రాన్ని బుధవారం ఆయన జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ దిలీప్‌తో కలిసి సందర్శించారు. గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, నర్సరీలను పరిశీలించారు. అనంతరం రవీందర్ మాట్లాడుతూ వర్షం నీటిని వృథాగా పోనీయకుండా ప్రతి ఇంట్లో విధిగా ఇంకుడు గుంతను నిర్మించాలని సూచించారు. గ్రామంలో మురుగునీటి వ్యవస్థ గురించి అధికారులు, సర్పంచ్‌ను అడిగి తెలుసుకున్నారు. హరితహారంలో భాగంగా పంపిణీ చేసేందుకు నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విద్యావతి, ఈజీఎస్ ఏపీఓ అజీజ్ పాల్గొన్నారు.

- పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ రవీందర్

ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత తవ్వించాలి

మొయినాబాద్: ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత తవ్వించాలని.. తద్వారా వర్షం నీరు వృథాగా పోకుండా భూగర్భ జలాలు పెంపొందించాలని పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్, స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ రవీందర్ అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా బుధవారం ఆయన మండల పరిధిలోని చిలుకూరు గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో చేపట్టిన ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్మాణం, తడి చెత్త పొడి చెత్త వేరు చేసే విధానాన్ని పరిశీలించారు. గ్రామంలో స్వచ్ఛ భారత్ మిషన్ పనులు సంతృప్తిగా ఉన్నాయని.. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సర్పంచ్ గునుగుర్తి స్వరూపను అభినందించారు. ఆయన వెంట జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్, డీపీఓ శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

గీత కార్మికులకు ప్రభుత్వం అండ



గీత కార్మికుడు జంగయ్య గౌడ్‌కు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: కల్లు గీత వృత్తిలో ప్రమాదాలకు గురయ్యే కార్మికులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. మండలంలోని మద్రిపల్లికి చెందిన గీత కార్మికుడు జంగయ్యగౌడ్ ఇటీవల తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ భాగ్యమ్మ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లింది. ఆయన సహకారంతో బాధితుడికి ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కును బుధవారం ఎమ్మెల్యే తన నివాసంలో బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుల, చేతి వృత్తుల వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం మద్రిపల్లికి చెందిన అండాలకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.20 వేల విలువ చేసే చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, సర్పంచులు ఎల్‌ఎన్‌రెడ్డి, జంగయ్యగౌడ్, మార్కెట్ డైరెక్టర్ రమేశ్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం వరకు మెట్రో రైలును పొడిగించాలి

- మంత్రి కేటీఆర్‌కు విన్నపం



మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అరవింద్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం వరకు మెట్రో రైలును పొడిగించాలని మంత్రి కేటీఆర్‌కు విన్నవించినట్లు బీఆర్‌ఎస్ నాయకుడు కర్నె అరవింద్ తెలిపారు. బుధవారం మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు విన్నవించినట్లు చెప్పారు. ఎల్‌బీనగర్ వరకు ఉన్న మెట్రో రైలును ఇబ్రహీంపట్నం వరకు పొడగిస్తే విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని ఆయన తెలిపారు.

చిన్నమ్మను చూడడానికి వెళ్తూ..



మధు మృతదేహం వద్ద బోరున విలపిస్తున్న తల్లి, చిన్నమ్మ



సాగర్ రహదారిపై ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

- రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం
- మన్నెగూడ క్రాస్ రోడ్డులో ఘటన
- సాగర్ రోడ్డుపై బంధువుల రాస్తారోకో
- స్తంభించిన ట్రాఫిక్

ఇబ్రహీంపట్నం రూరల్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నమ్మను చూడడానికి బాబాయ్‌తో కలసి బైక్‌పై వెళుతున్న విద్యార్థి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. మన్నెగూడ క్రాస్ రోడ్డులో బైక్ యూటర్న్ తీసుకుంటుండగా లారీ ఢీకొంది. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఆదిబట్ల పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడ గ్రామానికి చెందిన శ్రీశైలం, సంతోష దంపతులు. వీరికి ఒకే ఒక్క కుమారుడు మధు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఇదే గ్రామంలో చిన్నమ్మ పద్మ, చిన్నాన్న బీరప్ప ఉంటారు. పొలానికి వెళ్లిన పద్మ అనారోగ్యానికి గురైంది. ఆమెను మన్నెగూడ సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించారు. సాయంత్రం 4గంటల సమయంలో భార్య పద్మను చూడడానికి బీరప్ప బైక్‌పై మన్నెగూడకు బయలు దేరాడు. ఈ సమయంలో అన్న కుమారుడు మధు కూడా చిన్నమ్మను చూడడానికి బీరప్ప వెంట వెళ్లాడు. బైక్ మన్నెగూడ క్రాస్‌రోడ్డు వద్ద యూటర్న్ తీసుకుంటుండగా ఇబ్రహీంపట్నం వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మధు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న తల్లి, చిన్నమ్మ ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు.



మధు(ఫైల్)

సాగర్ రహదారిపై ఆందోళన

విద్యార్థి మృతదేహంతో కుటుంబ సభ్యులు, బంధువులు సాగర్ రహదారిపై రాస్తారోకో చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాత్రి 8 గంటల వరకు ఆందోళన జరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మన్నెగూడ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు వందలాది వాహనాలు నిలిచిపోయాయి. ఇబ్రహీం పట్నం ఏసీపీ ఉమా మహేశ్వర్‌రావు, ఆదిబట్ల పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

నాన్న అడుగుజాడల్లో నడుస్తా

- ప్రజాసేవకు అంకితమవుతా
- ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తనయుడు రినీష్‌రెడ్డి
- చేవెళ్లలో ఘన స్వాగతం



అంబేడ్కర్, పూలే విగ్రహాలకు నివాళులర్పించి మాట్లాడుతున్న రినీష్‌రెడ్డి

చేవెళ్ల: నాన్న అడుగుజాడల్లో నడుస్తూ ప్రజాసేవకు అంకితం అవుతానని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి తనయుడు పట్నం రినీష్‌రెడ్డి స్పష్టం చేశారు. తాండూర్‌లో క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరయ్యేందుకు రినీష్‌రెడ్డి బుధవారం హైదరాబాద్ నుంచి చేవెళ్ల మీదుగా భారీ కాన్వాయ్‌తో బయలుదేరారు. ఎమ్మెల్సీ అభిమానులు, బీఆర్‌ఎస్ నాయకులు రఘువీర్‌రెడ్డి, యాదగిరి, మాణిక్యరెడ్డి, నర్సింలుల ఆధ్వర్యంలో ఆయనకు భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. పట్టణంలోని మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల నుంచి అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్, చాకలి ఐలమ్మ, ఇంద్రారెడ్డి, రాజేందర్ రెడ్డి విగ్రహాల వరకు ర్యాలీ సాగింది. మహనీయుల ప్రతిమలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం రినీష్ మాట్లాడుతూ.. తన తండ్రి ఆశయాల సాధనకు కృషి చేస్తానని, ఇకనుంచి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అయితే పేరుకే క్రికెట్ ముగింపు కార్యక్రమం అని, ఇది ముమ్మాటికీ పట్నం వారసుడి బల ప్రదర్శనే అని పలువురు చర్చించుకున్నారు. రినీష్‌రెడ్డి రాజకీయ అరంగ్రేటానికి ఇది సంకేతమని పలువురు పేర్కొన్నారు. దీనికి తోడు ప్రస్తుతం పట్నం మహేందర్‌రెడ్డి పార్టీ మార్పు జరుగుతుందనే ప్రచారం, కేసీఆర్, కేటీఆర్‌లతో సంప్రదింపులు జరిగిన తరువాత తదుపరి నిర్ణయం ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



ఎంపీ రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: త్యాగానికి ప్రతిరూపమైన పవిత్ర బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం తరువాత వచ్చే అతి ముఖ్యమైన పండుగ బక్రీద్ అన్నారు. ఈ పండుగ వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. సీఎం కేసీఆర్ ముస్లింల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని తెలిపారు.

విద్యార్థి బలవన్మరణం



నరేశ్ మృతదేహం

కడ్తాల్: మండలంలోని మైసిగండి గ్రామానికి చెందిన విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఏఎస్‌ఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మైసిగండికి చెందిన కేతావత్ నరేశ్(18) ఇంటర్ చదువుతున్నాడు. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కాసేపటికి ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న నరేశ్‌ను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తల్లి శారద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉందని ఏఎస్‌ఐ తెలిపారు.

శరవేగంగా ఆదిబట్ల అభివృద్ధి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: పరిశ్రమలు రాకతో ఆదిబట్ల మున్సిపాలిటీ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, ఇది సీఎం కేసీఆర్ చొరవతోనే సాధ్యమైందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా మంజూరైన రూ.5 కోట్లతో ఆదిబట్ల మున్సిపాలిటీలో సీసీ, బీటీ రోడ్ల పనులను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే మున్సిపల్ జనరల్ ఫండ్ రూ.3.76 కోట్లతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిబట్ల మున్సిపాలిటీ శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇప్పటికే ఔటర్‌రింగ్ రోడ్డు లోపలి, వెలుపలి ప్రాంతాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయని పేర్కొన్నారు. అలాగే కొత్తగా వెలుస్తున్న ఫాక్స్‌కాన్ లాంటి అంతర్జాతీయ ఎలక్ట్రానిక్ సంస్థలతో భూముల ధరలకు రెక్కలొచ్చాయని తెలిపారు. మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో అనేక పరిశ్రమలు వస్తున్నట్లు వివరించారు. అనంతరం కొంగరకలాన్‌లో క్రీడా మైదానం కోసం టీఎస్ ఐఐసీ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆర్తికగౌడ్, వైస్ చైర్‌పర్సన్ కలమ్మ, కౌన్సిలర్లు ఎం మౌనిక, అర్చన, సంధ్య, ఎస్ మౌనిక, మహేందర్, శ్రీనివాస్, నాగేశ్, హరిదాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు గోపాల్‌గౌడ్, బీఆర్‌ఎస్ నేతలు జంగయ్య, నారాయణ, రవీందర్, జంగయ్య, ప్రవీణ్, రాజు, మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, ఏఈ వీరాంజనేయులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ జిల్లా సాధనకు ఉద్యమిద్దాం



జిల్లా సాధనపై రూపొందించిన పాటల సీడీని ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్: షాద్‌నగర్‌ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలనే ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా సాధన కమిటీ అధ్యక్షుడు ఎమ్మె సంతోష్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఓ హోటల్‌లో జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో తయారు చేయించిన పాటల సీడీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. షాద్‌నగర్‌ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం కొంగరకొలాన్‌లో ఉన్న కలెక్టరేట్ కార్యాలయం సామాన్యులను అందుబాటులో లేదన్నారు. కలెక్టరేట్‌కు వెళ్లాలంటే సామాన్యులు, రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రత్యేక వాహనం ఉంటే తప్ప కార్యాలయానికి వెళ్లలేమని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా కలెక్టరేట్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న షాద్‌నగర్‌ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సామాజిక వేత్త వీ గంగిరెడ్డి, పీ ప్రభాకర్, డీ శ్రీనివాస్, టీ నర్సయ్య, సీ వెంకటేష్, కే శివకుమార్, ఏ జగన్, రాజశేఖర్‌రెడ్డి, కుమార్, శ్రీనివాస్‌చారి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యం

మంత్రి హరీశ్‌రావు

గోల్కొండ: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రైవేటు ఆసుపత్రులకు ధీటుగా వైద్య సేవలు అందించేందుకు భారీగా నిధులు కేటాయిస్తున్నామని వైద్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. బుధవారం ఆయన మెహిదీపట్నంలోని సరోజినీ కంటి ఆసుపత్రిలో మంత్రి మహమూద్ అలీతో కలిసి ఫాకో మెషిన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమం ప్రపంచంలోనే మొట్టమొదటిది అన్నారు. అంధత్వ రహిత తెలంగాణే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఫాకో యంత్రాలతో మరింత మెరుగైన కంటి శస్త్ర చికిత్సలు చేసే వీలు ఉంటుందని, కాటరాక్ట్ సర్జరీల నిర్వహణలో ఫాకో మెషిన్‌లు కీలకమన్నారు. కార్యక్రమంలో నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ మెరాజ్, సరోజినిదేవి కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజలింగం, ఆర్‌ఎంవో డాక్టర్ నజాఫీ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



వెంకటేశ్(ఫైల్)

కడ్తాల్: మండలంలోని శ్రీశైలం – హైదరాబాద్ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు బుధవారం మృతి చెందాడు. ఏఎస్‌ఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూర్‌కు చెందిన వెంకటేశ్(25) హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. మంగళవారం రాత్రి బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరాడు. కడ్తాల్ – ముద్విన్ గేట్ మధ్య ముందు వెళుతున్న వాహనం సడన్ బ్రేక్ వేయడంతో టిప్పర్‌ను ఢీ కొన్నాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్‌ను నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



రఘు మృతదేహం

కేశంపేట: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొండారెడ్డిపల్లి శివారులో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఫరూఖ్‌నగర్ మండలం దొంతికుంట తండాకు చెందిన పాత్లావత్ రఘు(35)కు మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం పోచమ్మగడ్డ తండాకు చెందిన కవితతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. మూడు నెలల క్రితం భార్య, భర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో భార్య కవిత పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. మూడు రోజుల క్రితం భర్త రఘు పోచమ్మగడ్డ తండాకు వెళ్లి భార్య కవితతో గొడవ పడ్డాడు. ఆ తర్వాత ఇంటి నుంచి బయటికి వచ్చి కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ధనుంజయ తెలిపారు.

రెండేళ్ల కుమారుడితో తల్లి అదృశ్యం



సరస్వతి, శ్రీచరణ్(ఫైల్)

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ తన రెండేళ్ల కుమారుడితో కలిసి అదృశ్యమైన సంఘటన బుధవారం వెలుగుచూసింది. ఏఎస్‌ఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాచారం మండలం గున్‌గల్ గ్రామానికి చెందిన సరస్వతిని, కడ్తాల్‌కు చెందిన ఎర్రోల బాల్‌రాజ్‌కు ఇచ్చి 2015లో వివాహం జరిపించారు. వీరికి రెండు సంవత్సరాల బాలుడు శ్రీచరణ్ ఉన్నాడు. ఈ నెల 24న తోటి కోడలు స్వప్నతో సరస్వతి గొడవ పడింది. దీంతో సరస్వతి తన కుమారుడు శ్రీచరణ్‌ను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం ఇంటికి వచ్చిన భర్త బాలరాజ్ భార్య, కుమారుడు కనిపించకపోవడంతో పలుచోట్ల వెతికాడు. ఆచూకీ లభించకపోవడంతో బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

భిక్షాటనకు వెళ్లి..



చాందీ(ఫైల్)

మీర్‌పేట్: భిక్షాటనకు వెళ్లిన మహిళ కనిపించకుండా పోయిన ఘటన మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం చోటుచేసుకుంది. సీఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ మండలం అల్మాస్‌గూడ రాజీవ్ గృహ కల్ప కాలనీకి చెందిన నేనావత్ చాందీ(60), భర్త తులసీరామ్ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తుంటారు. నెల రోజుల క్రితం చాందీ భిక్షాటనకు వెళ్లి ఇంటికి రాలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు



కుక్కల దాడిలో గాయపడిన పుల్లయ్య

షాద్‌నగర్ రూరల్: మండలంలోని వెలిజర్ల గ్రామంలో బుధవారం వీధి కుక్కలు స్వైరవిహారం చేశాయి. కుక్కల దాడిలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన వెంకటయ్య, పుల్లయ్య సాయంత్రం రోడ్డుపై నడుచుకుంటూ వెలుతుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో వీధి కుక్కల బెడదను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.